సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 4 । అక్టోబర్ । 2023



కోటి లింగాల సంకల్పం !

పాల్వంచలోని ఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో కోటి శివ పార్థివ లింగాల తయారీ సంకల్ప సేవ ముమ్మరంగా సాగుతోంది. 10లో



వేటాడితే.. వేటు తప్పదు

స్వేచ్ఛగా సంచరించాల్సిన వన్యప్రాణులను ఎవరైనా వేటాడితే కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33°/ 21°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఒకటి రెండు చోట్ల మాత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

రామయ్య సేవలో అహోబిల జీయర్ స్వామి



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న జీయర్ స్వామి, అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని అహోబిల జీయర్ స్వామి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు, అధికారులు జీయర్‌స్వామికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భద్రాద్రి అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జీయర్ స్వామికి భద్రాద్రి రామయ్య ప్రసాదంతో పాటు జ్ఞాపికను ఆలయ ఈఓ రమాదేవి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, సిబ్బంది రామిరెడ్డి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన 'ఎన్‌క్వాస్'



ఆస్పత్రి పరిసరాలు పరిశీలిస్తున్న ఎన్‌క్వాస్ సభ్యులు

పాల్వంచ : పాల్వంచ సీహెచ్‌సీని మంగళవారం ఎన్‌క్వాస్ ఎక్స్‌టర్నల్ అసెస్‌మెంట్ టీం సందర్శించింది. డాక్టర్ గోబిల్ ధోపా (అసోం), జ్యోతి ఉల్లాస్ లోన్డే (మహారాష్ట్ర), శ్రీకాంత్‌తో కూడిన బృందం మూడు రోజుల పాటు ఆస్పత్రి నిర్వహణ తీరుతెన్నులపై పూర్తి స్థాయిలో పరిశీలించనుంది. ఈ సందర్భంగా చికిత్స అందించే విధానం, సిబ్బంది విధులు తదితర అంశాలను సభ్యులు క్షుణ్ణంగా తనిఖీ చేసి నివేదిక రూపొందించనున్నారు. ఆస్పత్రి నిర్వహణపై మంచి మార్కులు వస్తే మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఏడాదికి రూ.3 లక్షల చొప్పున మూడేళ్ల పాటు, ముస్కాన్ ప్రోగ్రామ్‌లో రూ.2 లక్షల చొప్పున అందించనున్నారు. ముందుగా టీం సభ్యులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు, సర్జన్ సోమరాజు దొర స్వాగతం పలికారు.

షెడ్యూల్ ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో పని చేస్తున్న ఎస్‌జీటీ, ప్రభుత్వ, లోకల్ బాడీ ఉపాధ్యాయులు బదిలీ షెడ్యూల్ ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ వెంకటేశ్వరాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవిత భాగస్వామి పాయింట్స్ తొలగింపు, నమోదు, హెచ్‌ఆర్‌ఎంఎస్, డీఎస్సీ ర్యాంక్ నమోదు, సరి చేసుకునేందుకు మాత్రమే 4వ తేదీన డీఈఓ కార్యాలయంలో తగు ఆధారాలతో అప్పీళ్లు సమర్పించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బదిలీలకు సంబంధించి తుది సీనియారిటీ జాబితాలు 5న వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని, 6, 7 తేదీల్లో ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్స్ ఎంచుకోవాలని సూచించారు. 8వ తేదీన ఆప్షన్స్ ఎడిట్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. స్పౌజ్ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు వారి భర్య/ భర్త పని చేస్తున్న పాఠశాల వైపునకు ఉన్న ఖాళీలను ఎంపిక చేసుకోవాలని, లేకుంటే వారి బదిలీని రద్దు చేయడం, స్పౌజ్ పాయింట్స్ తొలగించడంతో పాటు లెఫ్ట్ ఓవర్ ఖాళీల్లో పోస్టింగ్ ఇస్తామని ప్రకటించారు. నిబంధనల మేరకు వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలకు నీళ్లు!





నిబంధనలు పాటించకుండా నిర్మిస్తున్న భవనం (ఇన్‌సెట్) టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అడ్డుకోగా ఆగిపోయి.. తిరిగి నిర్మించిన భవనం

కొత్తగూడెం మున్సిపాలిటీలో నిర్మాణాలకు యథేచ్ఛగా అనుమతులు

- టీపీఎస్‌తో కలిసి అక్రమార్జనకు ఎత్తులు
- పత్తాలేకుండా పోయిన టాస్క్‌ఫోర్స్
- గతంలో నిలిపేసిన భవనాలు.. మళ్లీ నిర్మిస్తున్న వైనం

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రంలోని 'ఏ' గ్రేడ్ మున్సిపాలిటీలో 'నాలుగు రోజుల అధికారి' టౌన్ ప్లానింగ్‌లో కూడా చక్రం తిప్పుతున్నారు. భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా, టౌన్ ప్లానింగ్‌కు అనుగుణంగా పట్టణాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతి తీసుకున్న తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభించాలి. కానీ కొత్తగూడెంలో బహుళ అంతస్తుల నిర్మాణాలు చాలా సులభం! ఒకసారి మున్సిపాలిటీ కీలక అధికారి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌ను కలిస్తే చాలు.. నిబంధనలు పాటించాల్సిన అవసరం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరి ఇష్టానుసారం వారు నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం. ఇలా అనుమతి లేకుండా కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని గణేష్ టెంపుల్ ఏరియా, గొల్లగూడెంలోని ఓ బార్‌షాపు పక్కన, బస్టాండ్ ఎదురుగా ఓ లాడ్జీ వెనుకభాగంలో, ప్యూన్‌బస్తీలో టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా.. ఇలా అనేక ప్రాంతాల్లో నిబంధనలు అతిక్రమించి భవనాలు నిర్మిస్తున్నా వారు పట్టించుకోవడం లేదు. సదరు యజమానులపై చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. భవిష్యత్‌లో ప్రమాదాలకు కారణమయ్యేలా నిర్మిస్తున్నారంటూ ఫిర్యాదులు వచ్చినా అధికారులు స్పందించడం లేదంటే.. కీలక అధికారి, టీపీఎస్‌ల చేతివాటం ఉండే ఉంటుందని, అందుకే చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములకు ఇంటి నంబర్లు ఇవ్వడం, బహుళ అంతస్తులకు అనధికారిక అనుమతులు ఇవ్వడం ఏంటనే సందేహాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

కౌన్సిలర్ల అనుమతీ తప్పని సరి..

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో నిర్మించే బహుళ అంతస్తులకు మున్సిపల్ కార్యాలయంలో అనుమతి తీసుకోవాలి. కానీ బహుళ అంతస్తులు నిర్మించేవారు తీసుకునే అనుమతి ఒకటి.. నిర్మించేది మరొకటి అన్నట్టుగా ఉంది. ఇదంతా కీలక అధికారి, టీపీఎస్ కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరితో పాటు ఆయా ప్రాంతాల కౌన్సిలర్‌ను కలిసి వారికి కూడా కొంత ముట్టజెప్పే ఆనవాయితీ కొనసాగుతోందని, తద్వారా ఇక అడ్డుచెప్పే వారుండరని పట్టణ వాసులు అంటున్నారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా కనీసం ఫైర్ అనుమతి, సెట్‌బ్యాక్ తీసుకోకుండా, పార్కింగ్‌కు ఏ మాత్రం సౌకర్యం లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు.

లాంగ్ స్టాండింగే కారణం..!

కొత్తగూడెంలో ప్రస్తుతం ఉన్న టీపీఓ మిర్యాలగూడెం మున్సిపాలిటీలో మూడు రోజులు, కొత్తగూడెం మున్సిపాలిటీలో మరో మూడు రోజులు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్‌గా టీపీఓ స్థానికంగా ఉండకపోవడంతో టీపీబీఎస్(టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ సూపర్‌వైజర్) అంతా తానే అయి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీరాజ్ నుంచి డిప్యుటేషన్‌పై కొత్తగూడెం మున్సిపాలిటీకి ఏళ్లుగా వచ్చిన అధికారి టీపీబీఎస్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన కొత్తగూడెం మున్సిపాలిటీకి వచ్చి కూడా దాదాపు ఐదేళ్లకు పైగా అవుతోంది. ఇలా లాంగ్ స్టాండింగ్‌గా ఉన్నా.. ఆ అధికారిని బదిలీ చేయడానికి మున్సిపల్ అధికారులు సైతం ఇష్టపడడం లేదు. ఒకే దగ్గర ఐదేళ్లకు పైగా పని చేస్తుండడంతో నిబంధనలను సులువుగా అతిక్రమిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతూ, అనధికార అనుమతి ఇవ్వడంతో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు జిల్లా కేంద్రంలో ఎక్కువ సంఖ్యలో జరుగుతున్నాయి. వీటితో భవిష్యత్‌లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యవహారాలపై వివరణ కోరేందుకు మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు 'సాక్షి' ఫోన్ చేసినా ఆయన స్పందించలేదు.

అడ్రస్ లేని టాస్క్‌ఫోర్స్..

కొత్తగూడెం పట్టణంతో పాటు చుట్టుపక్క మండలాల్లో ఎక్కడైనా అనుమతి లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడితే, గతంలో అక్కడికి ఐదు శాఖల అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందం వెళ్లి నిర్మాణాలను అడ్డుకునేది. తాత్కాలికంగా భవనాన్ని డ్యామేజ్ చేసి, అనుమతి వచ్చే వరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టొద్దంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేది. కానీ ఇప్పుడా టీం కూడా అచూకీ లేకుండా పోయింది. దీంతో గతంలో అధికారులు అడ్డుకున్న భవనాల్లోనూ ప్రస్తుతం నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఓటరు జాబితా పరిశీలకురాలు బాల మాయాదేవి



మాట్లాడుతున్న బాల మాయాదేవి

సూపర్‌బజార్(కొత్తగూడెం): అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటరు జాబితా పరిశీలకురాలు బాల మాయాదేవి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 1,092 పోలింగ్ కేంద్రాలకు అదనంగా భద్రాచలంలో 2, కొత్తగూడెంలో 1 కలిపి మరో మూడు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. 1950 కంట్రోల్‌రూంకు, ఎన్‌జీఆర్‌ఎస్ పోర్టల్‌కు ఓటరు నమోదు, ఎపిక్ కార్డుల జారీ ప్రక్రియపై 155 ఫిర్యాదులు రాగా వాటన్నింటినీ పరిష్కరించామని తెలిపారు. నూతన ఓటరు నమోదుకు 2016 నుంచి 2020 వరకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో పాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా లబ్ధి పొందిన జాబితాల ఆధారంగా ఓటరు నమోదుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో కొండకోనల్లో జీవిస్తున్న కొండరెడ్ల కుటుంబాలకు 692 మందికి నూతనంగా ఓటుహక్కు కల్పించడం, నూతన ఓటరు నమోదుకు తీసుకున్న చర్యల పట్ల కలెక్టర్‌ను అభినందించారు. జిల్లాలో 9,45,094 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో 4,61,315 మంది పురుషులు, 4,83,741 మంది మహిళలు, 38 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని చెప్పారు. ఈనెల 4వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఆ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో, అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఆగస్టు 21న ప్రకటించిన ఓటరు జాబితా తర్వాత వచ్చిన 68,703 అభ్యంతరాలను పరిష్కరించినట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగులు, 80 సంవత్సరాల పైబడిన ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఆర్ఓ రవీంద్రనాథ్, కొత్తగూడెం ఆర్డీఓ శిరీష, ప్రత్యేక ఉప కలెక్టర్ కాశయ్య పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన నూతన న్యాయమూర్తులు



జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయమూర్తి సాయిశ్రీ

కొత్తగూడెంటౌన్: జిల్లాకు నూతనంగా నియమితులైన ముగ్గురు న్యాయమూర్తులు మంగళవారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగూడెం రెండవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ, మూడో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివనాయక్, భద్రాచలం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కే.సూరిరెడ్డి జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం అందజేయగా, బాధ్యతలు చేపట్టిన న్యాయమూర్తులను ఆయన అభినందించారు.

క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత

ప్రభుత్వ విప్ రేగా కాంతారావు



క్రీడా సామగ్రి పంపిణీని ప్రారంభిస్తున్న విప్ రేగా..

మణుగూరు రూరల్: సీఎం కేసీఆర్ క్రీడారంగానికి, క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. నియోజకవర్గంలోని అన్ని క్రీడా ప్రాంగణాలకు మంజూరైన సామగ్రిని మంగళవారం ఆయన మణుగూరులో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని రంగాలతో పాటు క్రీడారంగం దూసుకుపోతోందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి నియోజకవర్గానికి ఒక స్టేడియంతో పాటు రాష్ట్రంలోని 24 వేల గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించారని తెలిపారు. క్రీడాకారులు ఆటల్లో రాణిస్తూ జాతీయ స్థాయిలో విజయం సాధించి దేశానికి, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు పోశం నర్సింహారావు, సూదిరెడ్డి సులక్షణ, కామిరెడ్డి శ్రీలత, ఎంపీపీలు గుమ్మడి గాంధీ, రేగా కాళిక తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 1.77 కోట్ల చేపపిల్లల పంపిణీ

- ప్రభుత్వ రాయితీతో మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి
- జిల్లా మత్స్యశాఖాధికారి వీరన్న



అన్నపురెడ్డిపల్లిలో చేపపిల్లలను పంపిణీ చేస్తున్న వీరన్న

చండ్రుగొండ/అన్నపురెడ్డిపల్లి/జూలూరుపాడు : జిల్లాలోని చెరువులు, నీటి వనరుల్లో 1.77 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా మత్స్యశాఖాధికారి బాణోత్ వీరన్న తెలిపారు. చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, జూలూరుపాడు మండలాల్లో మంగళవారం ఆయన మత్స్య సొసైటీలకు చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 743 చెరువులు ఉన్నాయని, అందులో 663 చెరువులు, కుంటలు కాగా.. పెద్ద చెరువులు 77, రిజర్వాయర్లు 3 ఉన్నాయని తెలిపారు. ఆయా చెరువుల్లో ఈనెల 17 వరకు చేప పిల్లలు పోస్తామని చెప్పారు. ప్రభుత్వం వంద శాతం రాయితీపై అందిస్తున్న చేపపిల్లల పెంపకం ద్వారా మత్స్యకారులు, మత్స్య సొసైటీలు ఆర్థికాభివృద్ధి సాధించాలని అన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి ఎంపీడీఓలు రేవతి, అన్నపూర్ణ, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్, జూలూరుపాడు ఎంపీఓ తులసీరామ్, మత్స్యశాఖ ఫీల్డ్ అధికారి భార్గవ్, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, సర్పంచ్ బోడా పద్మ, ఉపసర్పంచ్ పర్సా వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఖాదర్, జూలూరుపాడు, గుండెపుడి సెక్రటరీలు పి కృష్ణ, హారిక పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను అర్హులకు పంచాలి



మణుగూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్షం నేతలు

అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన

మణుగూరు టౌన్: ప్రభుత్వ భూములను ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారి చెర నుంచి విడిపించి అర్హులైన పేదలకు పంచాలని, పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వాలనే డిమాండ్లతో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో మణుగూరులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి ఆర్‌ఐలకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. మణుగూరులోని 314, 853, 138, 41 సర్వే నంబర్లలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను ఇళ్లు లేని పేదలకు కేటాయించాలని కోరారు. గొత్తికోయ గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించి వారికి కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. అంతకుముందు కొమ్ము నృత్యాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, వైఎస్సార్ టీపీ, సీపీఐ, సీపీఎం, టీడీపీ, బీఎస్పీ నాయకులు శంకర్ నాయక్, గురజాల గోపి, వరలక్ష్మి, ఆలెం కోటి, బూర్గుల కరుణాకర్, నల్లగట్ల రఘు, వాసం రామకృష్ణ, సుభద్ర, కుంజా దుర్గ, సోమేశ్ గౌడ్, బచ్చల భారతి, బాబు, మేదరమెట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి 'కానుకలు'



- బతుకమ్మ చీరల పంపిణీకి ఏర్పాట్లు
- జిల్లాకు చేరిన 2.45 లక్షల చీరలు
- 442 రేషన్ షాపుల ద్వారా మహిళలకు అందజేత



దుమ్ముగూడెం మండలానికి చేరుకున్న బతుకమ్మ చీరలు

చుంచుపల్లి : ఆడపడుచులకు బతుకమ్మ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న చీరల పంపిణీకి అధికారులు బుధవారం శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటి వరకు జిల్లాకు 2.45 లక్షల చీరలు రాగా.. కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట, భద్రాచలం, మణుగూరు, జూలురుపాడుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక గోడౌన్లలో భద్రపరిచిన రెవెన్యూ అధికారులు.. వాటిని మండలాలు, మున్సిపాలిటీలకు తరలించారు. నేటి నుంచి పంపిణీ ప్రారంభం కానుండగా, మిగిలిన చీరలు సైతం రెండు రోజుల్లో జిల్లాకు చేరుతాయని అధికారులు వెల్లడించారు. రేషన్ కార్డులో పేరు ఉండి, 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు బతుకమ్మ చీరలను సీఎం కేసీఆర్ కానుకగా ప్రతియేటా అందిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలో జిల్లాలోని 23 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల్లో 3,69,461 మంది మహిళలకు ఈ కానుకలు అందించనున్నారు. తహసీల్దార్ల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ చీరల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తుంది. జిల్లాలోని రేషన్ షాపుల పరిధిలో అర్హులైన మహిళల జాబితాను పౌరసరఫరాల శాఖ అధికారులు ఇప్పటికే వివిధ మండలాలకు పంపించారు. దాని ప్రకారం అధికారులు చీరలు పంపిణీ చేస్తారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో బుధవారం ఈ ప్రక్రియను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

442 రేషన్ షాపుల ద్వారా..

మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైన సద్దుల బతుకమ్మ పండుగ పూట నిరుత్సాహ పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గత ఆరేళ్లుగా బతుకమ్మ కానుకలను అందజేస్తోంది. రాష్ట్రంలోని సిరిసిల్ల, షాద్‌నగర్, నారాయణపేట్, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో తయారు చేసిన చేనేత చీరలను ముందుగానే జిల్లాలకు తరలించి పండుగ నాటికి మహిళలకు పంపిణీ చేస్తుంటారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా నాలుగు డిజైన్లు, గులాబీ, లేతనీలం, మెరూన్, లేత బంగారం, పసుపు, కాఫీ కలర్లలో చీరలు తయారయ్యాయని అధికారులు తెలిపారు. వీటిని జిల్లాలోని 442 రేషన్ షాపుల ద్వారా మహిళలకు అందజేస్తారు. మండలాల పరిధిలో 373 షాపుల ద్వారా 3,01,255, మున్సిపాలిటీల పరిధిలోని 69 షాపుల ద్వారా 68,206 చీరలను పంపిణీ చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇక ఇప్పటివరకు జిల్లాకు 2,45,980 బతుకమ్మ చీరలు చేరుకున్నాయి. వీటిలో కొత్తగూడెం గోడౌన్‌లో 55 వేలు, అశ్వారావుపేట గోడౌన్‌లో 47,680, భద్రాచలంలో 37 వేలు, జూలూరుపాడులో 7,900, మణుగూరులో 61,500, ఇల్లెందు గోడౌన్‌లో 36,900 చీరలను భద్రపరిచారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన మహిళలు 3,69,461 మంది ఉన్నారు. అయితే ఇంకా 1,23,481 చీరలు రావాల్సి ఉంది.

డిస్మిస్డ్ కార్మికులకు తీపికబురు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గైర్హాజరుతో డిస్మిస్ అయిన కార్మికులకు యాజమాన్యం తీపికబురు చెప్పింది. 2019 జనవరి 01–2022 డిసెంబర్ 31 మధ్య డిస్మిస్ అయి, 01–04–2023 నాటికి 46 ఏళ్లు అంతకంటే తక్కువ వయసు ఉంటే మెడికల్ పరీక్షలు నిర్వహించి అండర్ గ్రౌండ్‌లో బదిలీ వర్కర్ కేటగిరీ–1గా మళ్లీ నియమిస్తారు. అయితే, డిస్మిస్ అయిన కాలం నాటికి ఐదేళ్లలో కనీసం రెండు సంవత్సరాలు వంద మస్టర్లు చేసిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈమేరకు అర్హులు గనుల మేనేజర్లకు దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో సూచించారు. గతంలో పనిచేసిన గని మూసివేస్తే ఏజెంట్ లేదా ఆ ఏరియా ఉన్నతాధికారులను సంప్రదించాలని తెలిపారు.

వెంకట్రావు గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

దుమ్ముగూడెం : భద్రాచలం నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పనిచేయాలని ఎమ్మెల్సీ తాతా మధు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన సీతారాంపురంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందుతోందని, భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే వెంకట్రావు గెలుపే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, నాయకులు జానీపాషా, సాగి శ్రీనివాసరాజు, తునికి కామేష్, బొల్లి వెంకటయ్య, ఎంపీటీసీ తెల్లం భీమరాజు, సర్పంచ్ భూక్యా చందు, మట్టా వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ పీఎస్‌గా మధిర రూరల్

- రాష్ట్రంలోనే మొదటి స్థానం
- జాబితాలో కొత్తగూడెం త్రీటౌన్, ఖమ్మం వన్ టౌన్‌కూ స్థానం

మధిర: కేసుల పరిష్కారంతో పాటు పలు అంశాల ప్రాతిపదికన రాష్ట్రంలోని ఉత్తమ పోలీసు స్టేషన్ల జాబితాను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఇందులో అత్యంత పరిశుభ్రమైన పోలీస్‌స్టేషన్‌గానే కాక, మహిళలతో పాటు ఇతర కేసుల పరిష్కారంలో మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈమేరకు 30పోలీసుస్టేషన్లతో జాబితా విడుదల చేయగా, 48.67 పాయింట్లతో మధిర రూరల్ పీఎస్ మొదటి స్థానం దక్కించుకుంది. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం త్రీటౌన్ పీఎస్ 44.87 పాయింట్లతో 19వ స్థానంలో, ఖమ్మం వన్‌టౌన్ స్టేషన్ 43.55 పాయింట్లతో 27వ స్థానంలో నిలిచాయి. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి ఈ మూడు స్టేషన్లకే స్థానం దక్కింది.

అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కొత్తగూడెంఅర్బన్: కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర 9వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కొత్తగూడెం జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించగా, ఆయన మాట్లాడారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థి మాలోత్ అఖిల్ పరుగుపందెంలో కాంస్య పతకం, మిడ్ రిలేలో మాలోత్ అఖిల్, మాలోత్ ప్రేమ్‌కుమార్ కాంస్య పతకం, షాట్‌పుట్, డిస్కస్ త్రోలో ఎస్‌కె.రియాజ్‌పాషా కాంస్య పతకాన్ని సాధించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సముద్రాల శ్రీనివాస్, బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులకు బాల ప్రతిభ రత్న అవార్డులు



అవార్డు అందుకుంటున్న చిన్నారులు ద్రాక్ష, వేదిక

కొత్తగూడెంటౌన్: గాంధీ జయంతి సందర్భంగా ఈనెల 2న హైదరాబాద్ పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో జరిగిన నృత్య పోటీల్లో ప్రతిభను చాటిన కొత్తగూడేనికి చెందిన చిన్నారులు ద్రాక్ష, వేదికను బాల ప్రతిభ రత్న అవార్డులు వరించాయి. పాత కొత్తగూడెంలోని బూడిదగడ్డ జీపీఎస్ పాఠశాలలో వీరిద్దరూ రెండో తరగతి చదువుతున్నారు. గాంధీ జయంతి సందర్భంగా సీరాజ్ అండ్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా చిన్నారులు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్, యాక్టర్ రోజా కై జర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

9 మంది బైండోవర్



నిందితులను తహసీల్దార్ ఎదుట హాజరు పరిచిన ఎక్సైజ్ పోలీసులు

జూలూరుపాడు: తొమ్మిది మంది నాటు సారా తయారీ, విక్రయదారులను ఎక్సైజ్ పోలీసులు మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. సాయిరాం తండాకు చెందిన లకావత్ శాంతి, కరివారిగూడేనికి చెందిన బానోత్ కవిత, బోడా హస్లీ, గుగులోత్ వీరన్న, లకావత్ హస్లీ, గుగులోత్ లక్ష్మా, వాగొడ్డుతండాకు చెందిన అంగోత్ శివకుమార్, అంగోత్ బాలు, దుబ్బాతండాకు చెందిన గుగులోత్ గోవిందులు సారా తయారు చేసి విక్రయిస్తుండగా కొత్తగూడెం ఎక్సైజ్ ఎస్‌ఐ సాయికుమార్ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. వీరందరినీ స్థానిక తహసీల్దార్ శారద ఎదుట హాజరు పరిచినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ తెలిపారు.

ఐదు స్మార్ట్ ఫోన్లు చోరీ

దుమ్ముగూడెం : మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన బత్తుల గోపికి చెందిన ఐదు స్మార్ట్ ఫోన్‌లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి ఫోన్లు ఎత్తుకెళ్లినట్టు బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

వేటాడితే.. వేటు తప్పదు

- వన్యప్రాణులను స్వేచ్ఛగా బతకనివ్వాలి
- సంహరిస్తే జైలు శిక్ష, జరిమానా
- చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామంటున్న అధికారులు

ఈనెల 8 వరకు వన్యప్రాణుల వారోత్సవాలు

అడవులు పచ్చగా ఉంటేనే వర్షాలు కురుస్తాయి. అప్పుడే పంటలు సమృద్ధిగా పండుతాయి. మరి అడవులు పెరగాలంటే వన్యప్రాణులను సంరక్షించాలి. అడవుల్లో స్వేచ్ఛగా సంచరించే వన్యప్రాణులను బతుకనిద్దామని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. అడవుల సంరక్షణకు ప్రభుత్వాలు సైతం ప్రత్యేక చట్టాలను రూపొందించాయి. ఈ క్రమంలో జిల్లాలోని కిన్నెరసాని అభయారణ్యాన్ని పరిరక్షించేందుకు 1977 జనవరి 24న చట్టం రూపొందించారు. ఈనెల 8 వరకు వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం.. – పాల్వంచరూరల్



సమాజంలో మనుషులతో పాటు అనేక రకాల జీవరాశులు మనుగడ సాగిస్తున్నాయి. అయితే మనుషులు తమ ఆహారం కోసం పలురకాల జీవులను వధిస్తున్నారు. ముఖ్యంగా వన్యప్రాణులను వేటాడుతున్నారు. దీన్ని నివారించేందుకు 50 ఏళ్ల క్రితం వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని రూపొందించారు. ప్రత్యేకించి వైల్డ్‌లైఫ్ చట్టాన్ని ఏర్పాటు చేశారు. అయితే స్మగ్లర్లు అక్రమంగా కలప తరలించేందుకు అడవులను హరిస్తున్నారు. ఇలా అడవులు అంతరిస్తుండడంతో వన్యప్రాణుల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. అడవుల్లో పులి, చిరుత, నెమలి, ఎలుగుబంటి, కుందేళు, పక్షులు, మొసళ్ల వంటి ప్రాణులు స్వేచ్ఛగా సంచరించేందుకు వైల్డ్‌లైఫ్ చట్టం ఏర్పాటు చేశారు. ఈ చట్టం ప్రకారం ఎవరైనా వన్యప్రాణులను సంహరిస్తే కఠిన శిక్ష పడుతుంది. కానీ చట్టాలపై అవగాహన లేనివారు, ఉన్నా పట్టించుకోని వారు వన్యప్రాణులను యథేచ్ఛగా వధిస్తున్నారు. అధికారులు సైతం చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుండడంతో వారికి అడ్డూ, అదుపు లేకుండా పోతోంది.

శిక్షల తీరు ఇలా..

- అటవీ జంతువైన పులిని చంపినా, చర్మాన్ని, గోళ్లను తీసినా, బంధించినా, విష ప్రయోగం చేసినా, ఒక ప్రదేశం నుంచి మరో చోటుకు తరలించినా 1972 వైల్డ్‌లైఫ్ చట్టం ప్రకారం మూడు నుంచి ఏడేళ్ల వరకు జైలుశిక్ష, రూ.25 వేల నుంచి రూ.లక్షకు పైగా జరిమానా విధించే అవకాశం ఉంది. జైలు శిక్ష పడితే ఏడాది వరకు బెయిల్ కూడా లభించదు.
- చిరుతపులిని చంపినా, పట్టుకున్నా, మరో చోటుకు తరలించినా వన్య మృగాల సంరక్షణ చట్టం ప్రకారం మూడు నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించొచ్చు.
- ఎలుగుబంటిని పట్టుకున్నా, సర్కస్‌లో ఆడించినా మూడు నెలల నుంచి ఏడాది వరకు జైలు శిక్ష, రూ. 20 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారు. వేటాడినట్లు రుజువైతే మాత్రం మూడు నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది.
- మొసళ్లను పట్టుకున్నా, చంపినా మూడు నుంచి ఏడేళ్ల జైలు, కోతులను పట్టుకున్నా, చంపినా, ఇంట్లో పెంచుకున్నా 5 నుంచి 7 నెలల పాటు జైలు శిక్ష, రూ.20 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదే కుందేళ్లకైతే మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 25 వేల నుంచి రూ. లక్ష వరకు జరిమానా విధిస్తారు.
- నెమలిని పట్టుకున్నా, వధించినా, గుడ్లను పగలగొట్టినా, హాని చేసినా వైల్డ్‌లైఫ్ చట్టం ప్రకారం ఏడేళ్ల జైలు శిక్ష, రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

గతంలో ఏడుగురిపై కేసులు

గతంలో కిన్నెరసాని డీర్ పార్కు సమీపంలో కొందరు దుప్పిని కుక్కలతో వేటాడి సోములగూడెం సమీప అటవీ ప్రాంతంలో వధించి మాంసం విక్రయించారు. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖాధికారులు ఇద్దరిని పట్టుకుని కేసు నమోదు చేశారు. దంతలబోరు అటవీ ప్రాంతంలో అడవి పందిని చంపి మాంసాన్ని విక్రయిస్తుండగా పాల్వంచ రేంజ్ అధికారులు పట్టుకున్నారు. ఇంకా ఏడూళ్లబయ్యారం, ములకలపల్లి, చండ్రుగొండ, ఇల్లెందు అటవీ ప్రాంతాల్లోనూ వన్యప్రాణుల వేటగాళ్లను పట్టుకోగా, ఈ అన్ని ఘటనలో మొత్తం ఏడుగురిపై కేసులు నమోదయ్యాయి.

వారోత్సవాలు నిర్వహిస్తున్నాం



వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు ఈనెల 8వ తేదీ వరకు జిల్లాలోని అన్ని అటవీ రేంజ్‌ల పరిధిలో నిర్వహిస్తాం. 'వనాలు పెంచండి, వన్యప్రాణులను కాపాడండి' నినాదంతో ఏజెన్సీ పరిధిలోని అటవీ సమీప గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తాం. దీంతో పాటు విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తాం.

– కృష్ణగౌడ్, జిల్లా అటవీశాఖాధికారి

చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం



వన్యప్రాణుల సంరక్షణ కోసం రూపొందించిన చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇందుకోసం ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం. వన్యప్రాణులను ప్రతిఒక్కరూ కాపాడాలని జాగృతం చేస్తున్నాం. ఎవరైనా వన్య ప్రాణులను సంహరించే ప్రయత్నం చేసినా, వాటికి హాని కలిగించినా కఠిన చర్యలు తప్పవు.

– కట్టా దామోదర్‌రెడ్డి, ఎఫ్‌డీఓ

పతనం దిశగా ఆయిల్‌పామ్

- ఈనెల గెలల ధరలో టన్నుకు రూ.795 మేర కోత
- ఆందోళనలో రైతులు



ఆయిల్‌పామ్ గెలలు

అశ్వారావుపేటరూరల్: ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు నెలనెలా ఆయిల్‌పామ్ గెలల ధర పడిపోతోంది. ధర భారీగా పతనమవుతున్న నేపథ్యాన సాగు చేస్తున్న రైతుల్లో ఆందోళన నెలకొంది. అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటలోని ఫ్యాక్టరీలకు రైతుల నుంచి గెలలను సేకరిస్తుండగా, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు కొన్ని నెలలుగా స్వల్పంగా తగ్గుతున్నా ఈనెల భారీగా పడిపోయింది. గతేడాది జూన్‌లో ఆయిల్ పామ్ గెలల టన్ను ధర రూ.23,467, జూలైలో రూ.20,267గా ఉంది. ఆ తర్వాత నుంచి నానాటికీ పతనమవుతోంది. ఈ ఏడాది ఆరంభం నుంచి రూ.10వేల మార్కుకు పైగానే ఉన్నా రైతులు ఆశించిన స్థాయిలో మాత్రం పెరగకపోగా ప్రతినెలా తగ్గుతోంది. ఈనెల టన్నుకు ఏకంగా రూ.795 తగ్గి రూ.13,026 నుంచి రూ.12,231కు పడిపోయింది. ధర భారీగా తగ్గిన నేపథ్యాన వివరాలు వెల్లడించేందుకు ఆయిల్‌ఫెడ్ అధికారులు సుముఖత చూపడం లేదు.

ఈ ఏడాదిలో పతనమే ఎక్కువ..

ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు కేవలం నాలుగు నెలల్లో మాత్రమే ఆయిల్‌పామ్ గెలల టన్ను ధర స్వల్పంగా పెరగగా, మిగిలిన అన్ని నెలల్లోనూ తగ్గింది. జనవరిలో టన్ను ధర 13,781 కాగా, ఫిబ్రవరిలో రూ.180 పెరిగి రూ.13,961కి చేరింది. ఇక మార్చిలో రూ.18 తగ్గగా, ఏప్రిల్‌లో మళ్లీ రూ.262 పెరిగి రూ.14,205గా నమోదైంది. అలాగే, మే నెలలో రూ.858, జూన్‌లో రూ.723 తగ్గడం గమనార్హం. ఆ తర్వాత జూలైలో రూ.468 పెరగగా, ఆగస్టులో రూ.65, సెప్టెంబర్‌లో రూ.795 చొప్పున తగ్గింది. ఇదే ధర అక్టోబర్‌లో అమలవుతుంది. ఈనెల ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు రూ.795 చొప్పున తగ్గడంతో నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే దిశగా ధరలు తగ్గితే సాగుపై ప్రభావం పడుతుందని చెబుతున్నారు. అయితే, ఇప్పటి వరకు ఆయిల్ పామ్ సీజన్ కాకపోవడం, అంతర్జాతీయంగా చమురు ధరల పతనంతోనే గెలల ధర తగ్గిందని ఆయిల్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. కానీ సెప్టెంబర్ నుంచే గెలల దిగుమతి పెరిగినా ధర పెరగాల్సింది పోయి తగ్గడంపై రైతులు, రైతు సంఘాల నాయకులు ఆందోళన చెందుతున్నారు.

పట్టాల పంపిణీతో జన్మ ధన్యం

- కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు
- 347 మందికి రూ.80 కోట్ల విలువైన స్థలాల కేటాయింపు



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): ఇళ్ల స్థలాల పంపిణీతో తన జన్మ ధన్యమైందని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటి పరిధిలోని గంగాబిషన్ బస్తీ మసీదు సమీపంలో సింగరేణి, రైల్వే నిర్వాసితులు 347 మందికి 100 గజాల చొప్పున మంగళవారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి స్థలం రాని వారికి త్వరలోనే కమిటీ సభ్యులతో సర్వే చేయించి అర్హులందరికీ వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. అధికారుల తప్పిదాలతో కొందరి పేర్లు జాబితాలో చేర్చలేదని, వారందరికీ న్యాయం చేస్తామని అన్నారు. అర్హులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. తప్పు చేసిన అధికారులపై శాఖా పరమైన చర్యల కోసం ఉన్నతాధికారులతో చర్చిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, కొత్తగూడెం ఆర్డీఓ శిరీష, తహసీల్దార్ పుల్లయ్య, సింగరేణి జీఎం శాలేంరాజు, జీకే ఓసీ పీఓ రమేష్, ఎస్టేట్స్ అధికారి తావురియా, ఎంపీపీ బాదావత్ శాంతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, నాయకులు వనమా రాఘవేంద్రరావు, మండే వీరహనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన



అభ్యర్థులతో మాట్లాడుతున్న జీఎం కట్టా బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్ –2 అభ్యర్థుల సర్టిఫికెట్లను మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య ఆధ్వర్యంలో పరిశీలించారు. సంస్థలో ఖాళీగా ఉన్న 177 ఎక్స్‌టర్నల్ పోస్టులకు గాను గతేడాది సెప్టెంబర్ 4న పరీక్ష నిర్వహించగా పలువురు మెరిట్ సాధించారు. వారిలో మంగళవారం 85 మంది సర్టిఫికెట్లు పరిశీలించగా బుధవారం 75 మంది సర్టిఫికెట్లు వెరిఫై చేయనున్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తామని జీఎం బసవయ్య తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం కోడూరి శ్రీనివాస్, డీజీఎం వేణుగోపాలరావు, పర్సనల్ మేనేజర్ సీవీఎస్ మూర్తి, డీవైపీఎంలు నాగేశ్వరరావు, కె.సంతోష్‌కుమార్, కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన ఘటన అశ్వారావుపేటలో మంగళవారం చోటుచేసుకుంది. పాల్వంచకు చెందిన చాటల సంపత్‌కుమార్, భార్య విష్ణుతులసితో కలిసి ద్విచక్రవాహనంపై అశ్వారావుపేటకు వచ్చారు. తిరిగి పాల్వంచ వెళుతుండగా స్థానిక సత్తుపల్లి రోడ్‌లో ఎదురుగా వచ్చిన టాటా మ్యాజిక్ వాహనం ఢీ కొట్టింది. దీంతో భార్యాభర్తలకు గాయాలు కాగా, చిట్టితల్లి అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డి గూడెం ఆస్పత్రికి తరలించారు.

బోడు మండల సాధనే లక్ష్యం

- మండలంగా ప్రకటించకుంటే మూకుమ్మడి రాజీనామాలు
- సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ తీర్మానం



రాజీనామా తీర్మాన కాపీని ఎంపీపీకి అందజేస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

టేకులపల్లి: అన్ని వనరులు, అవకాశాలు ఉన్నప్పటికీ బోడును మండలంగా ప్రకటించడం లేదని, అది సాధించే వరకు ఉద్యమం చేస్తామని సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు ఎంపీపీ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం బోడు గ్రామ రైతు వేదికలో సమావేశమయ్యారు. మూడు రెవెన్యూ గ్రామాలు, 12 గ్రామ పంచాయతీలు, 5 ఎంపీటీసీ స్థానాలు, 47 గ్రామాలు, 22 వేల మంది జనాభా, 11,500 మంది ఓటర్లు, పోలీసు స్టేషన్, హైస్కూల్ వంటి అన్ని వనరులు ఉన్నా మండలంగా ప్రకటించకపోవడం ఏంటని అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఎమ్మెల్యే, మంత్రి, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చామని, వివిధ రకాలుగా ఆందోళనలు కూడా చేశామని, అయినా ఎలాంటి స్పందన లేకపోవడం శోచనీయమని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకుంటే తమ పదవులకు, బీఆర్‌ఎస్ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని హెచ్చరించారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



మధు (ఫైల్)

చంద్రుగొండ : చంద్రుగొండ అంబేద్కర్‌నగర్‌కు చెందిన కంచర్ల మధు (23) అనే యువకుడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగుచూసింది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. అంబేద్కర్‌నగర్‌కు చెందిన రాములు పెద్ద కుమారుడు మధు సత్తుపల్లిలోని జేవీఆర్ కాలేజీలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రాములు ప్రధాన సెంటర్‌లో చిరు వ్యాపారం చేసుకుంటూ భార్యతో కలిసి అక్కడే ఉంటున్నాడు. ఈనెల 1వ తేదీ రాత్రి భోజనం అనంతరం మధు అంబేద్కర్‌నగర్‌లోని ఇంట్లో నిద్రించేందుకు వెళ్లాడు. తెల్లవారిన తర్వాత రాములు మధుకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో స్నేహితులతో కలిసి ఎక్కడికైనా వెళ్లి ఉంటాడని భావించాడు. కాగా, మంగళవారం ఇంట్లో నుంచి వాసన వస్తోందని పొరుగువారు చెప్పగా రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అంతా కలిసి వెళ్లి చూడగా మధు ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆత్మహత్య చేసుకుని మూడురోజులు కావడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాచినేని రవి తెలిపారు.

రెండు ఇసుక లారీల పట్టివేత



పోలీస్ స్టేషన్‌కు తరలించిన లారీలు

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను స్థానిక బ్లూకోట్స్ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. స్థానిక ఎస్సై పి. శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం వింజరం వద్ద గల గోదావరి నది నుంచి అనుమతి లేకుండా రెండు లారీల్లో అదే రాష్ట్రంలోని వినన్నపేట, తిరువూరుకు తరలిస్తున్నారు. ఆ సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి వద్ద లారీలను నిలిపి పత్రాలు తనిఖీ చేయగా, ఎలాంటి అనుమతులు లేవని గుర్తించారు. లారీలను స్వాధీనం చేసుకుంటుండగా మద్యం మత్తులో ఉన్న ఓ లారీ యజమాని కొనకళ్ల చందు పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. రాళ్లతో అతడే లారీ అద్దాలను ధ్వంసం చేసి పోలీస్ సిబ్బందే పగలకొట్టారంటూ ఎదురు దాడికి దిగాడు. దీంతో వాగ్వాదానికి దిగిన చందుతోపాటు మరో లారీ యజమాని నాగభూషణాన్ని అదుపులోకి తీసుకుని లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణా, పోలీసులతో వాగ్వాదం, లారీ అద్దాలు ధ్వంసం ఘటనలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభాలు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి పంచాయతీ పరిధిలోని పెట్రోల్ బంక్ సమీపంలో వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో రహదారి పక్కన ఉన్న రెండు విద్యుత్ స్తంభాలు సోమవారం అర్ధరాత్రి విరిగాయి. దీంతో లక్ష్మీదేవిపల్లి, ఇందిరానగర్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విరిగిన స్తంభాలను పరిశీలించిన విద్యుత్ ఏఈ ప్రతాప్ లారీ డ్రైవర్‌కు రూ.25 వేల జరిమానా విధించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. దీంతో మంగళవారం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

దాడి కేసులో 11 మంది అరెస్ట్

పాల్వంచరూరల్ : ఫంక్షన్ నిర్వాహకులపై దాడి చేసిన కేటరింగ్ సిబ్బంది 11 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ కార్తీక్ తెలిపారు. మండల పరిధిలోని కిన్నెరసాని రూరల్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈనెల 1వ తేదీన మండల పరిధిలోని పెద్దమ్మగుడి వద్ద గల విజయదుర్గ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఓ బారసాల వేడుకలో కేటరింగ్ సిబ్బంది, ఫంక్షన్ నిర్వాహకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా కేటరింగ్ సప్లయర్లు తమకు అవసరం లేదని చెప్పారు. దీంతో సిబ్బందిలో ఒకరైన రాకేష్ జగన్నాధపురానికి చెందిన ధర్మసోత్ వంశీ, జాటోతు నరేష్, గుగులోత్ సాయి, ఎం.శ్రీను, ధర్మసోత్ మహేందర్, సాయిచరణ్, యుగంధర్, బానోతు అఖిల్, ధర్మసోత్ నరేందర్, భద్రునాయక్, గుగులోతు రాకేష్ కలిసి ఫంక్షన్ నిర్వాహకులైన అప్పలనాయుడు, జక్కిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, సాయిప్రకాశ్‌రెడ్డిపై దాడిచేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి దాడి చేసిన 11 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఇసుక రీచ్‌ల పరిశీలన

పాల్వంచరూరల్ : కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశాల మేరకు మండల పరిధిలోని కిన్నెరసాని వాగులో గల ఇసుక రీచ్‌లను రెవెన్యూ, మైనింగ్, భూగర్భ జల వనరుల శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. రంగాపురం, నాగారం, సంగం, నారాయణరావుపేట, గంగదేవిగుప్ప గ్రామాల వద్ద కిన్నెరసానిలో ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు అనువుగా ఉందా లేదా అని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ హచ్యా, మైనింగ్ సర్వేయర్ శాంతకుమారి, భూగర్భ జలవనరుల శాఖ ఏజీపీ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. పరిశీలన నివేదికలను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

మద్యం సేవించి పాఠశాలకు..

ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

బూర్గంపాడు: నాగినేనిప్రోలు గ్రామపంచాయతీలోని గొమ్మూరు గిరిజన సంక్షేమ ప్రభుత్వ ప్రైమరీ మోడల్ స్కూల్‌లో ఓ ఉపాధ్యాయుడు నిత్యం మద్యం సేవించి పాఠశాలకు వస్తున్నాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మద్యం తాగి వచ్చిన ఉపాధ్యాయుడిని వారు నిలదీశారు. అతడిపై చర్య తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు. అతిగా మద్యం సేవించి రావడమే కాక తరగతి గదుల్లోనే పడుకుంటున్నాడని అంటున్నారు. అతడిని చూసి విద్యార్థులు భయపడుతున్నారని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడికి పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఐటీడీఏ పీఓ ఈ పాఠశాలను తనిఖీ చేసి సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఐటీడీఏ ఏటీడబ్ల్యూఓ నర్సింహారావు చర్యలు చేపట్టారు. రిసోర్స్ పర్సన్ రమేష్ పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టగా ఉపాధ్యాయుడు మద్యం సేవించినట్లు తేలింది. విచారణ నివేదికను ఐటీడీఏ ఉన్నతాధికారులకు అందించి వారి ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని ఏటీడబ్ల్యూఓ నర్సింహారావు తెలిపారు.

మద్యం మత్తులో వీరంగం

దాడి చేయడంతో నలుగురికి తీవ్ర గాయాలు

పాల్వంచ : మద్యం మత్తులో ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. సైకోలా ప్రవర్తిస్తూ నలుగురి తలలపై ఇనుప రాడ్‌తో బలంగా కొట్టడంతో వారు తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణంలోని జయమ్మ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలోని చల్లగుండ్ల సుజాతకు చెందిన బెల్ట్ షాపులో జట్‌పట్ రమేష్ అనే వ్యక్తి మద్యం సేవించి డబ్బు చెల్లించకపోవడంతో ఘర్షణ జరిగింది. దీంతో రమేష్ సుజాత, ఆమె భర్త రమేశ్, కొడుకు తరుణ్, అడ్డొచ్చిన శంకర్ అనే వ్యక్తిపై రాడ్‌తో బలంగా కొట్టాడు. దీంతో వారి తలలు పగిలి తీవ్రంగా గాయపడగా పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తీసుకెళ్లారు. ఈ మేరకు తరుణ్ ఫిర్యాదు మేరకు రమేష్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ బి.రాము తెలిపారు. రమేష్‌పై గతంలో మూడు కేసులు ఉన్నాయని చెప్పారు.

విద్యుత్ బకాయిల చెల్లింపుపై తీర్పు వాయిదా

రూ.6,756.92 కోట్లు ఇవ్వాల్సిందే అంటున్న ఏపీ

- చెల్లింపుపై గతంలో ఇచ్చిన స్టేను పొడిగించాలన్న తెలంగాణ
- వెంటనే సొమ్ము చెల్లించేలా చూడాలన్న ఏపీ
- సీజే ధర్మాసనం వద్ద వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ మధ్య నెలకొన్న విద్యుత్ బకాయిల వివాదంలో హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. బకాయిలు వెంటనే చెల్లించేలా చూడాలంటూ ఏపీ.. దీనిపై ఇప్పటికే ఇచ్చిన స్టేను పొడిగించాలంటూ తెలంగాణ వివిధ అంశాలను ప్రస్తావిస్తూ సుదీర్ఘంగా వాదనలు వినిపించగా.. హైకోర్టు మంగళవారం తన తీర్పును రిజర్వు చేసింది.

కేంద్రం ప్రకటన నేపథ్యంలో

రాష్ట్ర విభజన తర్వాత సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి తమకు తెలంగాణ నుంచి రూ.6,756.92 కోట్లు (అసలు రూ.3,441.78 కోట్లు, వడ్డీ, సర్‌చార్జీలు కలిపి మరో రూ.3,315.14 కోట్లు) రావాల్సి ఉందని ఏపీ వాదిస్తోంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. ఏపీకి 30రోజుల్లోగా రూ.6,756.92 కోట్లు చెల్లించాలంటూ 2022 ఆగస్టు 29న తెలంగాణకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు 2022 సెప్టెంబర్‌లో తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు వేశాయి. వాటిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. బకాయిల విషయంలో తెలంగాణ సర్కార్‌పై ఒత్తిడి తేవొద్దని స్టే ఇచ్చింది. ఈ వ్యవహారం ఇలా కోర్టులో ఉండగానే.. విద్యుత్ బకాయిలు తప్పకుండా చెల్లించాలని ఆదేశించినా తెలంగాణ ఇవ్వడం లేదని.. అందువల్ల రిజర్వు బ్యాంకులోని తెలంగాణ ఖాతా నుంచి సొమ్మును మినహాయించుకుని ఏపీకి చెల్లించే ప్రయత్నం చేస్తున్నట్లు కేంద్రం పార్లమెంటులో వెల్లడించింది. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్ సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చింది. దీనితో కేంద్రం ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని, చెల్లింపులపై స్టేను పొడిగించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులోని ప్రధాన పిటిషన్‌లో మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపింది.

ముందు విభజన సమస్యలు తేల్చాలంటూ..

తెలంగాణ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్, రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం కారణంగా ఉత్పన్నమయ్యే సమస్యలపై పూర్తిగా చర్చించకపోవడంతో ఈ ఇబ్బంది మొదలైందని వివరించారు. వివిధ అంశాల్లో ఏపీ కేంద్రానికి సహకరిస్తోందని.. అందువల్ల ఆ రాష్ట్రానికి అనుకూలంగా కేంద్రం నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. పునర్వ్యవస్థీకరణ చట్టం నుంచి ఉత్పన్నమయ్యే సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉండగానే.. కేంద్రం కఠిన నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అసలు రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 92 ప్రకారం ఈ వివాదంలో జోక్యం చేసుకునే అధికారం కేంద్రానికి లేదని వివరించారు.

బకాయిల వల్ల ఇబ్బందుల్లో ఏపీ డిస్కమ్‌లు

తెలంగాణ బకాయిలు చెల్లించకపోవడంతో ఏపీ విద్యుత్ డిస్కమ్‌లు ఆర్థిక ఇబ్బందుల్లో పడాల్సి వచ్చిందని ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పునర్విభజన తర్వాత విద్యుత్ ఉత్పత్తి, సరఫరాకు సంబంధించిన ఈ బకాయిలకు, పునర్విభజన చట్టానికి ఎలాంటి సంబంధం లేదని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విభజన తర్వాత 2017 వరకు కూడా ఏపీ డిస్కమ్‌లు తెలంగాణకు విద్యుత్ సరఫరా చేశాయన్నారు. బకాయిలు చెల్లించక బొగ్గు సరఫరా నిలిచిపోయిందని, తెలంగాణకు విద్యుత్ నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపారు. బకాయి ఉన్న విషయాన్ని తెలంగాణ కూడా అంగీకరిస్తోందని గుర్తు చేశారు. ఇక.. కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ సూర్యకిరణ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కేంద్రం జోక్యంతోనే తెలంగాణకు ఏపీ విద్యుత్ సరఫరా చేసిందని, బకాయిల చెల్లింపుపై ఉత్తర్వులు ఇచ్చే అధికారం కేంద్రానికి ఉందని కోర్టుకు వివరించారు. వాదనలు విన్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్‌ల ధర్మాసనం మంగళవారం తీర్పు రిజర్వు చేసింది.

కాంగ్రెస్, బీజేపీలను పాతర పెట్టాలి

- గజ్వేల్‌లో మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు
- పీసీసీ అంటే పేమెంట్ కలెక్షన్ సెంటర్
- బీజేపీని నమ్ముకుంటే అధోగతే



సిద్దిపేట జిల్లా కొండపాకలో మంగళవారం ఇంటిగ్రేటెడ్ ఆఫీసు కాంప్లెక్స్‌ను ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: 'పీసీసీ అంటేనే పేమెంట్ కలెక్షన్ సెంటర్. బీజేపీని నమ్ముకుంటే అధోగతే. ఈ రెండు పార్టీలను పాతాళంలో పాతర పెట్టాలి. ఉచిత కరెంటు, మూడు పంటలు, ధాన్యపు రాశులు కావాలంటే కేసీఆర్ వెంటే నడవాలి..' అని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో రూ.540 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీల తీరుపై మండిపడ్డారు. గత కాంగ్రెస్ హయాంలో ఎరువులు, విత్తనాల కోసం చెప్పులతో క్యూలు కట్టిన రోజులు రైతులు నేటికీ మరిచిపోలేదన్నారు. కరెంట్ సక్రమంగా రాక పంటలు ఎండిపోయి అన్నదాతలు అప్పుల పాలయ్యారని హరీశ్‌రావు విమర్శించారు. తప్పుదారి కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉచిత కరెంట్ ఆగమైతదని రైతులు గుర్తించారని చెప్పారు. బీజేపీ వల్ల కూడా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. కేసీఆర్ రైతే రాజు అనే సిద్ధాంతాన్ని నమ్ముకొని ముందుకు సాగటం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలో పోటీ చేస్తున్నారని, ఆయన గజ్వేల్‌లోనే ఉండాలనుకుంటే రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ కానుకగా అందించే బాధ్యత ఇక్కడి ప్రజలపై ఉందని చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు కేసీఆర్ గృహలక్ష్మి పథకం కింద 10 వేల ఇళ్లను మంజూరు చేశారని ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజాశర్మ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు పలు సంఘాల మద్దతు

గజ్వేల్ నియోజకవర్గం నుంచి ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పలు సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించాయి. గజ్వేల్ ఆర్యవైశ్య సంఘం, కుమ్మరి సంఘం, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, పద్మశాలి సంఘాలు ఈ మేరకు చేసిన తీర్మానాలను మంత్రి హరీశ్‌రావుకు అందించాయి.

కాంగ్రెస్‌ది గతం.. ఇప్పుడు ఖతం!

- వారంటీ ముగిసిన పార్టీ గ్యారంటీ ఎలా ఇస్తుంది?
- మోదీని కేసీఆర్ విమర్శించినంతగా వేరే ఎవరూ విమర్శించలేరు
- బీజేపీతో ఎలాంటి మిలాఖత్ లేదనడానికి ఇంత కంటే నిదర్శనం ఏం కావాలి
- జగిత్యాల సభలో మంత్రి కేటీఆర్



జగిత్యాల జిల్లా నూకపల్లిలో కేటీఆర్‌కు స్వీట్ అందజేస్తున్న డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుని కుమారుడు

జగిత్యాల, జగిత్యాల క్రైం, ధర్మపురి, సిరిసిల్ల, సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీది గతమని, ఇప్పుడా పార్టీ ఖతమైందని, వారంటీ ముగిసిన పార్టీ గ్యారంటీ ఎలా ఇస్తుందని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో స్థానిక ఎమ్మెల్యే సంజయ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. 150 ఏళ్ల కాంగ్రెస్ వారంటీ అయిపోయిందని, ఆరు గ్యారంటీలు ఇస్తే ప్రజలు నమ్ముతారా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు 24 గంటల కరెంట్‌పై అనుమానం ఉందని, జగిత్యాల నియోజకవర్గానికి వచ్చి కరెంట్ తీగలు పట్టుకుంటే తెలుస్తుందని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ దరిద్రం పోతుందని వ్యాఖ్యానించారు.

రేవంత్ ఆర్ఎస్ఎస్ ఏజెంట్

రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ ఏజెంట్ అని, ఆ పార్టీ నేత పంజాబ్ ముఖ్యమంత్రి అమరేందర్ సోనియాకు సైతం లేఖ రాశారని కేటీఆర్ గుర్తు చేశారు. బీజేపీ మతపిచ్చి పార్టీ అని, జనాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండుకోవడమే ఆ పార్టీకి తెలుసని ధ్వజమెత్తారు. పీఎం మోదీని సీఎం కేసీఆర్ విమర్శించినంతగా వేరే ఎవరూ విమర్శించలేరని, మాకు ఆ పార్టీతో, మోదీతో ఎలాంటి మిలాఖత్ లేదనడానికి ఇంత కంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. మోదీది గాడ్సే వారసత్వమని ఆరోపించారు.

బీఆర్ఎస్ అంటే కాళేశ్వరం.. కాంగ్రెస్ అంటే శనీశ్వరం

బీఆర్ఎస్ అంటే కాళేశ్వరమని, కాంగ్రెస్ అంటే శనీశ్వరమని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి మాతాశిశు ఆస్పత్రితోపాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. నరేంద్రమోదీ అంటే నమ్మించి మోసం చేసేవాడని విమర్శించారు. కాగా జగిత్యాల జిల్లాకేంద్రంలో నిర్మించిన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్‌తో కలిసి హోం మంత్రి మహమూద్‌అలీ ప్రారంభించారు.

ఒక్క రూపాయి లంచం లేకుండా..

రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంత్రి కేటీఆర్ 577 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు, 1,747 మందికి గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క రూపాయి లంచం లేకుండా నేరుగా ప్రజలకు లబ్ధి కలిగే విధంగా కేసీఆర్ పాలన వర్ధిల్లుతోందన్నారు.

మోదీ అబద్ధాల జాతర

ఎక్స్(ట్విట్టర్)లో మంత్రి కేటీఆర్ ధ్వజం

పీఎం నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలనే కాకుండా 140 కోట్ల మంది భారతీయులను మోసం చేశారని మంత్రి కేటీ రామారావు సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ (ట్విట్టర్)లో ధ్వజమెత్తారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి విభజన హామీలకు దిక్కులేకుండా పోయిందని ఆరోపించారు. మూడు రోజుల వ్యవధిలో రెండోసారి రాష్ట్రానికి వస్తున్న మోదీ విభజన హామీలకు పదేళ్లుగా పాతరేసి అబద్ధాల జాతర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వంద స్థానాల్లో డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఆర్టీసీ చైర్మన్ గోవర్ధన్‌కు వీడ్కోలు

- ముగిసిన పదవీకాలం
- పొడిగింపులేక తప్పుకున్న బాజిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ చైర్మన్‌గా పదవీకాలం ముగియటంతో ఆ పదవి నుంచి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తప్పుకున్నారు. మరికొద్ది నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల వరకు బాజిరెడ్డి ఆ పదవిలో కొనసాగుతారని ఆర్టీసీ వర్గాలు భావించాయి. కానీ, పదవీకాలం ముగిసినా ప్రభుత్వం నుంచి పొడగింపు ఆదేశాలు వెలువడలేదు. ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో ఆశాభంగం కలిగిన సిట్టింగ్‌లను బుజ్జగించేందుకు ఆర్టీసీ చైర్మన్ పదవి లాంటి వాటిని వారికి అప్పగించవచ్చని, అందుకే బాజిరెడ్డికి కొనసాగింపు అవకాశం ఇవ్వలేదన్న ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఇక్కడి బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆధ్వర్యంలో బాజిరెడ్డికి వీడ్కోలు సమావేశం జరిగింది. బాజిరెడ్డి దంపతులను ఆర్టీసీ ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. రెండేళ్ల పదవీకాలంలో, ఆర్టీసీ అభ్యున్నతికి బాజిరెడ్డి ఎంతో కృషి చేశారంటూ అధికారులు కితాబిచ్చారు. ''రెండేళ్లపాటు ఆర్టీసీ చైర్మన్‌గా పనిచేయటం, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఆర్టీసీని బాగు చేసేందుకు ఎండీ సజ్జనార్‌తో కలిసి కృషి చేయడం జీవితంలో మరవలేను. నేను చైర్మన్‌గా ఉన్న సమయంలోనే, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటం నాకు ఎంతో సంతోషం కలిగించింది''అని బాజిరెడ్డి పేర్కొన్నారు.

6న ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 6 నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రాష్ట్రంలోని మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ, యువతలో క్రీడానైపుణ్యాన్ని పెంపొందించేందుకు క్రీడా పరికరాల కిట్లను అందచేసే కార్యక్రమాలను ముమ్మరంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి కలెక్టర్లతో మంగళవారం రాత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని సీఎం కేసీఆర్ రంగారెడ్డి జిల్లాలో లాంఛనంగా ప్రారంభిస్తారని, ఈ నెల 14 నాటికి బతుకమ్మ చీరెల పంపిణీని పూర్తి చేయాలని చెప్పారు.

జిల్లా వార్తలు

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ



బాలికకు సైకిల్ అందజేస్తున్న చెంగలరావు, తదితరులు

బూర్గంపాడు: ఐటీసీ అనుబంధ రోటరీక్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యాన సారపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు మంగళవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఐటీసీ పీఎస్‌పీడీ అడ్మిన్ చెంగలరావు మాట్లాడుతూ ప్రభుత్వం, స్వచ్ఛంద సేవాసంస్థలు చేయూతను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. ఐటీసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్‌తో పాటు భూక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాలికల ఖో-ఖో జట్టు ఎంపిక



ఉమ్మడి జిల్లా ఖో-ఖో బాలికల జట్టు

కల్లూరు: కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఉమ్మడి జిల్లా స్థాయి ఖో-ఖో బాలికల జట్టు ఎంపికకు పోటీలు నిర్వహించారు. పోటీలకు 150 మంది హాజరుకాగా, ప్రతిభ కనబర్చిన 15 మందితో జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఇన్‌చార్జ్ పీడీ నరసింహమూర్తితో పాటు పత్తిపాటి నివేదిత, స్టెల్లా నిరంజన్, పసుపులేటి వీరరాఘవయ్య తదితరులు పోటీలను పర్యవేక్షించారు. కాగా, బుధవారం బాలుర జట్టు ఎంపిక చేయనున్నారు.

రేపు ఖమ్మంలో జాబ్‌మేళా

ఖమ్మం స్పోర్ట్స్: నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించేందుకు ఈనెల 5వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జరిగే జాబ్‌మేళాలో శ్రీసాయి అగ్రి టెక్నాలజీస్ బాధ్యులు పాల్గొని వంద మందిని ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. 19నుంచి 32 ఏళ్ల వయస్సు కలిగి ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హత ఉన్న వారు హాజరుకావాలని సూచించారు.

కోటి లింగాల సంకల్పం !



పార్థివ లింగాల తయారీలో పాల్గొంటున్న కర్ణాటక, స్థానిక మహిళలు



తయారుచేసిన పార్థివ లింగాలు

పాల్వంచలో 5లక్షల మట్టి లింగాల తయారీ

- సేవలో నిమగ్నమైన వివిధ రాష్ట్రాల భక్తులు
- కాశీలో కోటి లింగాల అభిషేకార్చన ద్వారా గిన్నిస్ రికార్డ్ లక్ష్యం

పాల్వంచ: కోటి శివ పార్థివ లింగాల తయారీ సంకల్ప సేవ ముమ్మరంగా సాగుతోంది. రాష్ట్రంలోని చారిత్రక శివాలయాల్లో ఈ లింగాల తయారీ సేవలో భక్తులు పాల్గొంటున్నారు. స్వహస్తాలతో లింగాల తయారీని భక్తులు అదృష్టంగా భావిస్తుండగా, పాల్వంచలోని ప్రాచీన శ్రీ ఆత్మలింగేశ్వరాలయానికి తాకిడి పెరుగుతోంది. ఈ సేవకు కర్ణాటక రాష్ట్రం నుంచి మహిళలు సైతం రావడం విశేషం. ఇక్కడి ఆలయంలో 5లక్షల లింగాలు తయారు చేయాలని నిర్వాహకులు సంకల్పంగా నిర్ణయించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీశ్రీశ్రీ విజయానంద నాద గురు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తంగిరాల రామచంద్ర సాయి ఆధ్వర్యాన శివ సంకల్పమస్తు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ శివాలయాల్లో లింగాలను తయారు చేయిస్తుండగా.. అవసరమైన మట్టి, ఇతర సామగ్రిని సంస్థే సమకూర్చింది. అన్ని ఆలయాల్లో తయారు చేసిన కోటి లింగాలను కాశీ పుణ్యక్షేత్రానికి తరలించి అక్కడ ప్రపంచంలోనే మొదటి సారిగా కోటి పార్థివ లింగాలకు అభిషేకార్చన నిర్వహించి గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా పాల్వంచలోని ఆదర్శ మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు కంచర్ల విమల ఆధ్వర్యాన మహిళలు, భక్తులు సేవలో పాల్గొంటున్నారు.

భక్తులకు వసతి

అచ్చుల సాయంతో మట్టితో పార్థివ లింగాలను రూపొందిస్తున్నారు. అనంతరం వీటిని ఆరబెట్టి ట్రేలో పేరుస్తున్నారు. ఇలా బాక్స్‌ల్లో నింపి కాశీకి తరలించనున్నారు. కాగా, లింగాల తయారీకి వచ్చిన ఇతర రాష్ట్రాల భక్తులకు ఆలయ నిర్వాహకులు మచ్చా శ్రీనివాసరావు ఆధ్వర్యాన భోజన, వసతి ఏర్పాట్లు చేశారు.

తయారీలో పాల్గొనడం అదృష్టం



కోటి పార్థివ లింగాలు తయారు చేసే కార్యక్రమం జరుగుతున్నట్లు తెలిసి పాల్వంచలోని శ్రీఆత్మలింగేశ్వరాలయానికి వచ్చాం. ఇక్కడే పదిహేను రోజులు ఉండి సేవ చేయాలని నిర్ణయించుకున్నాం. మా చేతులతో స్వయంగా లింగాలను తయారు చేస్తుండడం అదృష్టంగా భావిస్తున్నాం.

– పార్వతి, రాయచూర్, కర్ణాటక

నెల రోజుల పాటు..



సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 30 వరకు లింగాలు తయారు చేయనున్నాం. ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పాల్వంచ ఆలయంలో 5లక్షల లింగాలు తయారు చేయనున్నాం. అనంతరం కార్తీకమాసంలో కాశీలో అభిషేకార్చన నిర్వహించనున్నాం.

– కంచర్ల విమల, ఆదర్శ మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు

ఎంతో పుణ్యఫలం



లింగాలను తయారు చేయడం ఎన్నో జన్మల పుణ్యఫలంగా భావిస్తున్నాం. గిన్నిస్ బుక్ రికార్డ్ కోసం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కోటి లింగాలు తయారుచేశాక కాశీలో అభిషేకార్చన నిర్వహిస్తారు. ఆలయ నిర్వాహకులు మాకు అన్ని ఏర్పాట్లు చేశారు.

– అనురాధ, కర్ణాటక

నాలుగు ఏరియాల్లోనే వంద శాతం



సత్తుపల్లి సమీపంలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్

- సింగరేణిలో గడిచిన నెల 91 శాతం ఉత్పత్తి
- ఓసీల్లో 94, భూగర్భగనుల్లో 74శాతంగా నమోదు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని భూగర్భగనులు, ఓసీల్లో ఆగస్టులో వంద శాతం బొగ్గు ఉత్పత్తి నమోదు కాగా.. సెప్టెంబర్‌లో మాత్రం వెనకబడింది. గత నెల ఆరు ఏరియాలు వంద శాతం ఉత్పత్తి సాధించగా, ఈసారి నాలుగు ఏరియాల్లోనే సాధ్యమైంది. సింగరేణి వ్యాప్తంగా 19 ఓపెన్‌కాస్ట్ గనుల్లో సెప్టెంబర్‌లో 45,30,444 టన్నులకు గాను 42,54,162 టన్నులు(94 శాతం), 24 భూగర్భగనుల్లో 6,43,171 టన్నులకు 4,78,536 టన్నుల(74 శాతం) బొగ్గు ఉత్పత్తి నమోదైంది. మొత్తంగా 51,73,615 టన్నుల లక్ష్యానికి గాను 47,32,698 టన్నులు(91శాతం) ఉత్పత్తి నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

ఆ ఏరియాల్లో ఓకే...

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలకు గాను కేవలం నాలుగు ఏరియాలు వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయి. ఇల్లెందు ఏరియాలో 146 శాతం, బెల్లంపల్లిలో 145, కొత్తగూడెంలో 116, మణుగూరు ఏరియాలో 112 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైంది. ఇక మిగతా ఏడు ఏరియాలను వెనుకబడ్డాయి. కాగా, గడిచిన ఆరు నెలల్లో పరిశీలిస్తే సంస్థ నిర్దేశించిన 31.97 మిలియన్ టన్ను బొగ్గు ఉత్పత్తికి గాను 31.14 మిలియన్ టన్నుల(97 శాతం) ఉత్పత్తి సాధించగలిగారు. ఈ ఆరు నెలల్లో కొత్తగూడెం రీజియన్‌లోని ఇల్లెందు ఏరియా 128శాతంతో మొదటి స్థానంలో నిలవగా, మణుగూరు ఏరియాలో 125 శాతం, బెల్లంపల్లి ఏరియాలో 123 శాతం, కొత్తగూడెం ఏరియా 114 శాతంతో ఆతర్వాత స్థానాలు దక్కించుకున్నాయి.

ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు బొగ్గు ఉత్పత్తి వివరాలు

ఏరియా	లక్ష్యం	ఉత్పత్తి	శాతం
ఇల్లెందు	13,64,520	17,40,546	128
మణుగూరు	53,46,154	66,58,176	125
బెల్లంపల్లి	14,42,308	17,72,966	123
కొత్తగూడెం	58,94,904	67,24,200	114
ఆర్జీ-3	24,14,231	23,87,167	99
ఆర్జీ-1	20,32,996	19,19,186	94
ఆర్జీ-2	41,32,069	37,25,288	90
మందమర్రి	20,87,384	18,07,618	87
శ్రీరాంపూర్	30,73,865	25,27,809	82
భూపాలపల్లి	21,40,846	13,48,421	63
అడ్రియాల ప్రాజెక్ట్	8,68,096	4,74,136	55

నేడు తపాలా ఉద్యోగుల సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఖమ్మంగాంధీచౌక్: ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ సంయుక్త ఆధ్వర్యాన బుధవారం సమ్మె చేపడుతున్నట్లు తెలంగాణ సర్కిల్ జీడీఎస్‌పీ జేసీఏ చైర్మన్ సీహెచ్.కోటేశ్వరరావు తెలిపారు. ఈసమ్మెలో బ్రాంచ్ పోస్టుమాస్టర్లు, గ్రామీణ తపాలా ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. ఖమ్మంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిది గంటల విధానం, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేసి ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎం.రాంప్రసాద్, వి.శ్రీనివాసరావు, వై.పట్టాభిరామయ్య, వై.సతీష్, పుల్లారావు, రామయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు హైదరాబాద్‌కు పాల ఉత్పత్తిదారులు

ఖమ్మంవ్యవసాయం: హైదరాబాద్ రావిరాలలో రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య(విజయ డెయిరీ) ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన మెగా డెయిరీని గురువారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పాడి పరిశ్రమ సహకార సంఘాలకు చెందిన రైతులను తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లాలాపేటలో 5లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన డెయిరీ ఉండగా, అధునాతన పరిజ్ఞానంతో మరో 8లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన మెగా డెయిరీని నిర్మించారు. ఈ డెయిరీ ప్రారంభోత్సవానికి రెండు జిల్లాల నుంచి 30 మంది పాల ఉత్పత్తిదారులను తీసుకెళ్తున్నట్లు డీడీ కుమార స్వామి తెలిపారు.

కాంపోజిట్ సిలిండర్లతో భద్రత



సిలిండర్లు అందజేస్తున్న అంకుర్

సత్తుపల్లిటౌన్: ఇండెన్ గ్యాస్ నూతనంగా గృహ వినియోగదారుల కోసం ప్రవేశపెట్టిన కాంపోజిట్ సిలిండర్‌తో భద్రత లభిస్తుందని సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సేల్స్ ఆఫీసర్ అంకుర్ తెలిపారు. సత్తుపల్లిలోని శ్రీహనుమాన్ దత్తసాయి ఇండెన్ గ్యాస్ కార్యాలయంలో వినియోగదారులకు మంగళవారం ఆయన కాంపోజిట్ సిలిండర్లు అందజేసి మాట్లాడారు. ఇవి సాధారణ సిలిండర్ల కంటే 50శాతం తక్కువ బరువు ఉంటాయని, గ్యాస్ ఎంత ఉందో ఎప్పటికప్పుడు చూసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీల నిర్వాహకులు గుండు ఉమామహేశ్వరరావు, శశాంక్, వందనపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.